

రైతుల పేర్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం : పంటల బీమా పథకానికి రైతుల పేర్ల నమోదు ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం పంటల బీమా పథకం అమలు తీరుపై వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ బుడితి రాజశేఖర్ వ్యవసాయ శాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, వ్యవసాయ శాఖ అధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పంటల బీమా పథకానికి రైతులే ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ఈ విషయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ 15వ తేదీ నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియ ముగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏడిఎలు, ఉద్యానవనశాఖ అధికారులు పాల్గొన్నారు.

'చింత'లపూడి గాడిన పడేనా..!

గత ప్రభుత్వ హయాంలో పడకేసిన చింతపూడి ఎత్తిపోతల పనులు

4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరం

అధికారంలోకొస్తే 'చింతలపూడి' పూర్తిచేస్తామంటూ కూటమి హామీ

నాలుగు నెలలైనా పనుల్లో కదలిక లేని పరిస్థితి

నవంబర్‌లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించేనా?

భూములిచ్చినా రైతుల సమస్యలకు పరిష్కారం లేకుండాపోయే


చింతలపూడి ఎత్తిపోతల కాలువ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభంపై మెట్ట ప్రాంత రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. గత ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకున్న పాపాన లేకుండా పోయింది. దీంతో రైతాంగానికి తీవ్ర నష్టం ఏర్పడింది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా కూటమి ప్రభుత్వం చింతలపూడి ప్రాజెక్టును పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 2008లో అంకురార్పణ జరిగింది. మొత్తం రూ.1,701 కోట్ల బడ్జెట్ అంచనాలతో ఈ ప్రాజెక్టు పనులు మొదలయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 191 గ్రామాలకు తాగునీరు, 2.52 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఏళ్లు గడిచినా ఈ ప్రాజెక్టు పనులు ముందుగా సాగని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చింతలపూడి ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించే విధంగా ప్రణాళికలు తయారు చేసింది. పశ్చిమలో 15, కృష్ణాలో 18 మండలాలకు మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రాజెక్టును రూపుద్దిదారు. ఇందుకు రూ.4,909 కోట్లు బడ్జెట్ అంచనాలతో రూ.53.5 టిఎంసిల నీటిని తరలించే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. శరవేగంగా ప్రాజెక్టు పనులు కూడా సాగించారు. 2019 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగునీటి కోసం నానా తంటాలు పడుతున్న పరిస్థితి కొనసాగుతూనే ఉంది. జిల్లాల విభజనతో కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం ఏలూరు జిల్లాలో కలిసింది. గడిచిన ఎన్నికల్లో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. న్యాజివీడు ఎంఎల్ఎ మంత్రి కొలుసు పార్థసారధి సైతం నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీంతో మెట్ట ప్రాంత రైతులు చింతలపూడి ప్రాజెక్టు పూర్తిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. గడిచిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించారు. కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై చూపించినంత శ్రద్ధ చింతలపూడిపై చూపించడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటివరకూ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తోనే ముందుకు నడిచింది. నవంబర్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుంది. ఈ బడ్జెట్‌లోనైనా చింతలపూడి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ముందుకుసాగేలా చేస్తారా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ప్రాజెక్టు పూర్తికావాలంటే ఈ బడ్జెట్‌లో కచ్చితంగా నిధులు కేటాయించాల్సి ఉంది. చింతలపూడి ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాల్సి ఉంది.

ఇప్పటికీ రైతులకు న్యాయం జరగని పరిస్థితి..

చింతలపూడి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగని పరస్థితి నెలకొంది. రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించిన పరిస్థితి ఉంది. బహిరంగ మార్కెట్లో ఎకరా పొలం రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతుండగా, ప్రభుత్వం మాత్రం రూ.12 లక్షల నుంచి రూ.19 లక్షలలోపే ఇస్తామంటూ భీష్మించుకుని కూర్చుంది. టిడిపి ప్రభుత్వం హయాం నుంచి రైతులు దీనిపై పోరాటం చేస్తున్నారు. తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. చెట్లకు, మోటార్లకు, ఇతర వాటికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. భూసేకరణ విషయంలో పాలకులు మొండిగా వ్యవహరించడం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడింది. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామంటూ 2019 ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చినా గడిచిన ఐదేళ్లలో పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించి చింతలపూడి ప్రాజెక్టును పరుగులు పెట్టించాలని రైతులు కోరుతున్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కృషి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఈ నెల 31 నాటికి ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియపై రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలను 2015లో నిర్వహించడం జరిగిందని, మళ్లీ 2024లో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఆయా మండలాలకు తహశీల్దార్లను, జల వనరుల శాఖ ఎఇలను ఆథరైజ్డ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ ఈ నెల 21న ప్రారంభమైందని, నవంబర్ 29వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. నీటి తీరువా వసూలు, శివారు భూములకు నీటి విడుదల తదితర అంశాలను నీటి పంపిణీ సంఘాల ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక ఆయకట్టు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఓటర్ల జాబితాలను తయారు చేయాలన్నారు. ప్రాజెక్ట్ కమిటీలు ఒకటి ఉండగా దాని పరిధిలో 20 నీటి పంపిణీ కమిటీలు ఉన్నాయని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 14, ఏలూరు జిల్లాలో నాలుగు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 112 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా వాటిలో 98 మేజర్ ఇరిగేషన్, 14 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో 98 డబ్ల్యూయుఎలకు 12 మంది చొప్పున సభ్యులు, 14 డబ్ల్యూయుఎలకు ఆరుగురు చొప్పున మొత్తం 1,260 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. ఇప్పటికే నోడల్ అధికారులను మాస్టర్ ట్రైనర్లను గుర్తించి నియమించినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకూ జల వనరుల శాఖ సహ ఇంజినీరు, తహశీల్దార్ ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా సిద్ధం చేసి, అక్టోబర్ 31న ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, ఆర్‌డిఒ దాసి రాజు, కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వై.భవానీశంకరి, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఎవి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రజా పంపిణీ వ్యవస్థపై సివిల్ సప్లయిస్ అధికారులు, తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను పేదల అభ్యున్నతికి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. పంపిణీలో అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. కొంతమంది ఎఫ్‌పి షాపు డీలర్లు, ఎండియు నిర్వాహకులు లబ్ధిదారులకు కందిపప్పు, పంచదార పంపిణీలో అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పంచదార నూరుశాతం అందుబాటులో ఉందని, కందిపప్పు అందుబాటులో ఉన్న నిల్వలను దృష్టిలో ఉంచుకొని పేదల ప్రాంతాల్లో తొలుత పంపిణీ చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, బియ్యాన్ని రీసైకిల్ చేయడం ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదన్నారు. తహశీల్దార్లు ప్రతినెలా ఒకటో తేదీ నుండి 17వ తేదీల మధ్య ఐదు ఎఫ్‌పి షాపులను, ఐదు ఎండియులను విధిగా తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఎఫ్‌పి షాపులకు ఎంత స్టాక్ వచ్చిందో వివరాలను సంబంధిత మండల తహశీల్దార్‌లకు తెలియజేయాలని డిఎస్ఒకు సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్లను కూడా తనిఖీ చేసి స్టాక్ భద్రపర్చడంలో తగు జాగ్రత్తలు తీసుకున్నారా, ఎలుకలు బెడద ఉందా తదితర అంశాలను పరిశీలించాలన్నారు. గృహ వినియోగానికి వాడే గ్యాస్ సిలిండర్ తినుబండారాలు, ఆహార పదార్థాలు తయారు చేసే హోటల్స్, తోపుడుబండ్ల వారు ఎట్టి పరిస్థితుల్లో వినియోగించడానికి వీల్లేదన్నారు. ఈ విషయమై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ఆర్‌డిఒలు దాసి రాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వై.భవానీశంకరి, డిస్ట్రిక్ సివిల్ సప్లయిస్ మేనేజరు టి.శివరామ ప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ శివశంకర్, సిపిఒ ఎం.మోహనరావు, తహశీల్దార్ పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటనూనె, గ్యాస్ ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. సామాన్య ప్రజలే కాదు మధ్య తరగతి ప్రజలు కూడా ధరల భారంతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అధిక ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించిందని కానీ ఇప్పటికీ ఈ విధానం అమలు కాలేదన్నారు. ఇసుక ధరలో గతానికి ఇప్పటికీ పెద్ద తేడా లేదన్నారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులు, ఇసుక ర్యాంపుల్లో పనిచేసే కార్మికులు ఉపాధిలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పరోక్షంగా పెంచే ఆలోచనలో ప్రభుత్వం తన ప్రయత్నాన్ని ముమ్మరం చేస్తోందని, ఇది బాధాకరమని తెలిపారు. కూటమి ప్రభుత్వం కూడా రూ.20 వేల కోట్ల భారాన్ని ట్రూ అప్‌ఛార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేయడానికి స్మార్ట్ మీటర్లు పెట్టాలని సిద్ధమైందని తెలిపారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రైతులకు సంబంధించి వాటర్ మోటార్లకు మీటర్లు పెట్టం అని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చెప్పి ఇప్పుడు అధికారం చేపట్టాక దానికి అమలుకు పూనుకోవడం ద్రోహం అన్నారు. రాష్ట్ర వ్యాప్తింగా వైరల్ జ్వరాలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీలో చేర్చి సేవలందించాలని తెలిపారు. ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు పెట్టి విషజ్వరాలను అదుపుచేయాలని కోరారు. భారీ వర్షాలకు రోడ్లు పాడైపోయాయని, దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వెంటనే రోడ్లకు మరమ్మతులు చేట్టాలన్నారు. ఈ సమావేశంలో సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, కౌరు పెద్దిరాజు, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అధికారులకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - గణపవరం


వినతి అందజేస్తున్న నాయకులు

మండలకేంద్రమైన గణపవరంలో తాగునీరు, రహదారులతోపాటు ఇందిరమ్మ కాలనీలో డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిపిఎం మండల కార్యదర్శి ఎం.పెంటారావు, సభ్యులు చిన్నం చిననాగేశ్వరరావు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సూపరిటెండెంట్ వీర్రాజుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రహదారులు గోతులు పడటం వల్ల ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. ఎస్‌సి పేట, ఇందిరమ్మ కాలనీలో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అరుంధతీపేటలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

మోగల్లు అరుంధతీపేటలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో వ్యాధి నిర్ధారణా పరీక్షలు చేయాలని, తక్షణం మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావుకు కెవిపిఎస్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ మోగల్లు గ్రామంలో అరుంధతీ దళిత పేటలో గత నెల రోజులు నుంచి వివిధ విషజ్వరాలతో దళిత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మలేరియా టైఫాయిడ్ నుంచి డెంగీ, చికెన్ గున్యా, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. నెల రోజులుగా ప్రతి కుటుంబంలో పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఏదొక రూపంలో అనారోగ్యం బారిన పడిన సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందల మంది ఒకేసారి అనారోగ్యానికి గురవ్వడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎంతో మంది ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారని, మరికొంత మంది ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ భరించలేక ఆర్‌ఎంపిలచే అరకొర వైద్యం చేయించుకుంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రక్త పరీక్షలకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. టైఫాయిడ్, మలేరియా, చికిన్ గున్యా, డెంగీ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని, ఆ వ్యాధులు ఎందుకు వస్తున్నాయో నిర్ధరించాలని కోరారు. గ్రామంలో నీటి కాలుష్యం, వాయు కాలుష్యం అధికంగా ఉందని తెలిపారు. తాగునీరు నుంచి తీసుకునే ఆహారం వరకూ పరీక్షలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటి సర్వేచేసి రోగ నిర్ధారణ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని కోరారు. తక్షణం మోగల్లు అరుంధతీ దళిత పేటలో ప్రజలకు వైద్యంపై అవగాహన కల్పించి అన్ని విధాలా సేవలందించి వారిని ఆదుకోవాలని అధికారులను కోరారు. పంట బోదెలు శుభ్రపర్చి, బ్లీచింగ్ కొట్టి, మురుగునీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారిని కలిసిన వారిలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ ఉన్నారు.

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది

నిరసన కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి ఉదయకుమారి

ప్రజాశక్తి - ఆకివీడు


వినతిని అందజేస్తున్న ఐద్వా నాయకులు

మద్యం షాపుల సంఖ్యను విపరీతంగా పెంచుకుంటూ పోయి ఆఫర్ల పేరుతో మద్యాన్ని ఏరులై పారించడం, ఇష్టం వచ్చిన తీరులో బెల్ట్ షాపులను మంజూరు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన మద్యం విధానాన్ని, బెల్ట్ షాపులను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సాయంకాలం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్‌లోని గేటు వద్ద నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ కుమారి మాట్లాడుతూ ఈ రకమైన మద్యం పారుదల పెరగడంతో స్త్రీలపై దాడులు పెరుగుతాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలు ఆదాయ వనరుగా చూడటం సిగ్గుచేటు అన్నారు. విద్యా, వైద్యం ఉపాధి అంశాలపై దృష్టి పెట్టకుండా ఉచిత పథకాలు అంటూ రాజకీయం చేయడం తగదు అన్నారు. ప్రభుత్వం వెంటనే నూతన మద్యం విధానాలను రద్దు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి ప్రభుత్వమే మద్యం అమ్మకాలు జరపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డోకల లక్ష్మీ, ఎర్ర కృష్ణవేణి, బి.కృష్ణవేణి పాల్గొన్నారు.

డిఆర్ఒ ఉదయ భాస్కరరావు బదిలీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న జె.ఉదయభాస్కరరావు బదిలీ అయ్యారు. ఈయనను నెల్లూరు జిల్లా డిఆర్‌ఒగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఉదయ భాస్కరరావు స్థానంలో ఎం.వెంకటేశ్వర్లును జిల్లా డిఆర్‌ఒగా నియమిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై అవినీతి ఆరోపణలు!

విచారణ చేపట్టిన జిల్లా రిజిస్ట్రార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం సబ్ రిజిస్టర్ అధికారి ప్రశాంత్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తూ లేఖర్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై గురువారం జిల్లా సబ్ రిజిస్టర్ లంకా వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. విచారణ జరుగుతున్న సమయంలో కక్షిదారుడు స్వయంగా వచ్చి విచారణ అధికారికి భీమవరం సబ్ రిజిస్టర్ డబ్బులు దండుతున్నాడని వివరించారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు రూ.1000 నుంచి రూ.2 వేల వరకూ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన జిల్లా రిజిస్టర్‌కు వివరించారు. విచారణపై జిల్లా రిజిస్టర్ మీడియాతో మాట్లాడుతూ భీమవరం సబ్ రిజిస్టర్‌పై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టామన్నారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి, తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి

తణుకు : రాజీయే రాజమార్గమని, కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొనుట వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. గురువారం తణుకు 4వ అదనపు జిల్లా కోర్టు, రాష్ట్ర న్యాయ సేవల సంస్థ గుంటూరు వారి ఉత్తర్వుల మేరకు ఛైర్మెన్, జిల్లా జడ్జి ఏలూరు వారి ఆదేశాల మేరకు డిసెంబరు 14వ తేదీన ఉమ్మడి జిల్లాల్లో కోర్టులు ఉన్న ప్రతీ చోటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని మీడియా ప్రతినిధుల ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సత్యవతి మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడు క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, బ్యాంక్ బకాయిలు కేసులు, ఎంవిఒపి ఆక్సిడెంట్ కేసులు, కుటుంబ సభ్యులతో తగాదా కేసులు అంటే ఎంసి మెయింటినెన్స్, డివిసి గృహహింస కేసులు, సివిల్ కేసులు, ప్రామిశరీ నోట్ బకాయి కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకొవచ్చునని తెలియజేశారు. ప్రతీరోజూ కోర్టుల్లో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, దానిలో కూడా కేసులు రాజీ చేసుకుని డిసెంబరు 14వ తేదీన అవార్డు పొందవచ్చునని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు సివిల్ సప్లై అధికారులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని అన్నారు. వీటికి సంబంధించి రైతు సహాయక కేంద్రాల్లో 25 శాతం గన్ని బ్యాగులను భద్రపరుచుకోవాలని సూచించారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లను రైస్‌మిల్లుల వద్ద వెహికల్ మానిటరింగ్ అధికారులుగా నియమించటం జరిగిందన్నారు. వీరు కస్టోడియం అధికారుల సహకారంతో రైస్‌మిల్లుల వద్దకు ధాన్యం దిగుమతికి వచ్చిన వాహనాలను మూడు గంటల లోపులో దిగుమతి చేయించే బాధ్యతను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డిఒలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వై.భవాని శంకరి పాల్గొన్నారు.

భీమవరంతో ఎంతో అనుబంధం ఉంది

'క' చిత్రాన్ని విజయవంతం చేయండి

హీరో కిరణ్ అబ్బవరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంతో ఎంతో అనుబంధం ఉందని, ఇప్పటికి నాలుగుసార్లు భీమవరం వచ్చానని, నా మొదటి షార్ట్ ఫిలిమ్ 'ఓ మనసా ఇటు రావే' భీమవరంలోనే చేశామని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 'క' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం భీమవరం నాయుడు గారి కుండ బిర్యానీలో హీరో కిరణ్ అబ్బవరం సందడి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్ఆర్ కళ్యాణ మండపం, సంక్రాంతి వేడుకలలో ఈ ప్రాంతానికి వచ్చానని, మీరు చూపించే ఆదరణ ఎప్పటికీ మరవలేమని అన్నారు. ఈనెల 31న 'క' చిత్రం విడుదల కాబోతుందని, ఈ చిత్రం విజయవంతం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 1977లోని కథ ఆధారంగా ఈ చిత్రాన్ని చేశామని, 3 గంటలకే చీకటిపడటం, అప్పటి పోస్ట్‌మెన్స్ ఇలా ఎన్నో సరికొత్త వింతలతో ఎంతో కష్టబడి ఈ చిత్రాన్ని చేశామని, ఈ చిత్రం గొప్ప విజయం అందిస్తారని కోరుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా ఈ చిత్రాన్ని చూసి ఆ టికెట్ రాష్ట్రంలోని నాయుడు గారి కుండ బిర్యానీ 36 బ్రాంచ్‌ల్లో ఎక్కడ చూపించినా టికెట్ రాయితీతో ఆహారాన్ని అందిస్తారని, ఈ అవకాశాన్ని కూడా అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాయుడు గారి కుండ బిర్యానీ ఫౌండర్ వర నాయుడు మాట్లాడుతూ 'క' ఒక సరికొత్త చిత్రమని, చిత్రం పేరులోనే కొత్తదనం కనిపిస్తుందని, ఈ చిత్రం గొప్ప చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ చిత్రం టికెట్‌ను తమ 36 బ్రాంచ్‌లో ఎక్కడికైనా తీసుకుని వస్తే మీరు తినేవాటిలో టికెట్ రాయితీ అందిస్తామని తెలిపారు.

దేశాల మధ్య సమైక్యతే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశాల మధ్య సమైక్యత ప్రపంచ శాంతి ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యమని భీమవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవివర్మ అన్నారు. గురువారం క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని నిర్వహించారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్‌రాజు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.రంగరాజు, పి.సూర్యనారాయణ, అడవి సురేష్ కుమార్ మాట్లాడారు. 1947లో ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ ఈనెల 24న ఐక్యరాజ్యసమితి చార్టర్ వార్షికోత్సవంగా ప్రకటించిందని, ఇది ప్రపంచంలోని ప్రజల లక్ష్యాలను తెలుసుకొనేందుకు, ఐక్యరాజ్య సమితి విజయాలను కొనియాడబడేందుకు వారి మద్దతును కూడగట్టుకొనుటకు ఐక్యరాజ్యసమితి దినోత్సవం ప్రజలకు అంకితమివ్వబడుతుందని ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ ప్రకటించిందన్నారు. అనంతరం ఐక్యరాజ్య సమితి ప్రపంచ శాంతి నెలకొల్పాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌జె.చాన్ భాషా, కొండ్రు శ్రీనివాస్, భాస్కరరావు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ ప్రపంచ శాంతి పరిరక్షణకు యుఎన్ఒ కీలకపాత్ర పోషించిందని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ వై.మదురాజు మాట్లాడుతూ ఒఎన్ఒ దాని అనుబంధ సంస్థల ద్వారా విద్య, వైద్యం, వైజ్ఞానిక, రంగాలలో కృషిచేస్తున్నట్లు చెప్పారు. లెక్చరర్లు సిహెచ్.చైతన్య, కె.స్వరూపరాణి, పి.భాస్కరరావు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ కోసం ఎదురుచూపులు..!

నిర్మాణంపై దృష్టిపెట్టని ప్రభుత్వం

పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

మండలకేంద్రమైన గణపవరంలో నిలిచిపోయిన అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ప్రతి మండలకేంద్రంలో అన్నా క్యాంటీన్ నిర్మాణం చేయడానికి అప్పటి టిడిపి ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో 2019లో ఉంగుటూరు ఎంఎల్ఎగా ఉన్న గన్ని వీరాంజనేయులు స్థానిక మార్కెట్‌లో శంకుస్థాపన చేశారు. క్యాంటీన్ నిర్మాణం కోసం రూ.40 లక్షలు కేటాయించారు. మార్కెట్‌లో క్యాంటీన్ నిర్మాణం చేస్తే తమ వ్యాపారం చేసుకోవడానికి ఇబ్బందులు వస్తాయని, వ్యాపారులు నిర్మాణం ఆపాలని ఆందోళన చేశారు. క్యాంటీన్ స్లాబ్ వరకు చేరేసరికి ప్రభుత్వం మారి జగన్ ప్రభుత్వం రావడంతో క్యాంటీన్ నిర్మాణం నిలిచిపోయింది. ఈ సంవత్సరం జరిగిన ఎన్నికలలో మరలా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో స్థానికులకు ఆశలు చిగురించాయి. అన్నిప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ప్రారంభించడంతో గణపవరంలో కూడా అన్నా క్యాంటీన్ పనులను పూర్తిచేసి ప్రారంభిస్తారని ఎదురుచూసిన స్థానికులకు నిరాశ మిగిలింది. అధికారంలోకి వచ్చి వందరోజులు దాటినా ఇంతవరకు క్యాంటీన్ నిర్మాణంపై స్థానిక నాయకులు దృష్టి పెట్టకపోవటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల అన్నా క్యాంటీన్ పేదవారికి అందుబాటులో తెచ్చిన కూటమి నాయకులు గణపవరంలో కూడా క్యాంటీన్ ఏర్పాటుకు కృషిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


శంకుస్థాపన చేసిన శిలాఫలకం


మధ్యలో నిలిపివేసిన అన్నాక్యాంటీన్ నిర్మాణ పనులు

వారం వారం విద్యుత్ కోతలు

వినియోగదారుల ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెలలో ప్రతీ శుక్రవారం చెట్లు కొమ్మలు నరికివేత పేరుతో స్థానిక మండల విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ కోతలు విధించడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో ప్రతీ వారం ఈ విధంగా మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదరు శాఖ వారు కరెంటు సరఫరా నిలిపివేయడం వల్ల వ్యాపారాలు, చిన్న పరిశ్రమల వారు, గృహ వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. వాస్తవానికి మండలంలోని గ్రామాల్లో కరెంటు తీగలకు కింద ఉన్న చెట్ల వల్ల ఏ ఇబ్బందులూ లేకున్నా, ఒక్కోసారి ఎన్ని చెట్లు నరుకుతున్నారని అనే లెక్కలు విద్యుత్ శాఖ వారు చెప్పాలని వినియోగదారులు కోరుతున్నారు. తాము కడుతున్న విద్యుత్ బిల్లులకు తగిన విధంగా నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా అందించవలసిన బాధ్యత ఆ శాఖకు ఉందని, అది మరచి ప్రతీ వారం ఇలా వేధించడం సరికాదని వారు విమర్శించారు.

మాజీ ఎంపీపీ కమలకుమారికి పితృవియోగం

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్థానిక మండల ప్రజాపరిషత్ మాజీ అధ్యక్షులు, టిడిపి నాయకులు తమనంపూడి కమల కుమారి తండ్రి, స్థానిక విశ్రాంత వెటర్నరీ వైద్యులు కర్రి సత్యనారాయణ రెడ్డి(88) గురువారం ఉదయం మృతి చెందారు. ప్రస్తుతం ఆయన అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. కాగా గత కొంత కాలంగా ఈయన అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున పెనుమంట్రలోని ఒక ప్రయివేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన గతంలో పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు, ఇరగవరం, గ్రామాల్లో పశువైద్యాధికారిగా మంచి గుర్తింపు తెచ్చుకొన్నారు. వారి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ప్రజల కష్టాలు తీరేదెన్నడు!

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్యాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల కష్టాలు తీరడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.కళ్యాణి విమర్శించారు. స్థానిక మెంటేవారితోటలని సిపిఎం కార్యాలయంలో సిహెచ్.వరలక్ష్మి అధ్యక్షతన గురువారం మహిళా శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన అమరులకు పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికి ఒకవైపు భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడారు. అనంతరం నూతన శాఖా కార్యదర్శిగా సిహెచ్.వరలక్ష్మి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో శ్రీదేవి, శాలిని, మహాలక్ష్మి, వి.నాగమణి పాల్గొన్నారు.

నేరాల పట్ల జాగ్రత్త వహించండి


ప్రజాశక్తి - ఆకివీడు

దొంగతనాలు వింతవింతగా చేస్తున్నారని, అందులో మహిళల దొంగతనాలు వివరిస్తూ పెరిగిపోయాయని ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ సిహెచ్.నాగబాబు వివరించారు. బస్సులలో, రైళ్లలో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు మహిళలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన చెప్పారు. మహిళా దొంగలు ఏవిధంగా దొంగతనాలు చేస్తున్నారు అనే అంశాలను ఆయన గురువారం వలంటీర్ల ప్రదర్శనలతో వివరించారు. ఈమేరకు దొంగతనాలు చేసే మహిళల ఫొటోలతో స్థానిక మెయిన్ సెంటర్లో ప్రదర్శన ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో కటౌట్లు, బ్యానర్లు ప్రదర్శించారు. డ్వాక్రా మహిళలు, ఆ మార్గాల గుండా వెళ్లే మహిళలను ఆపి వారికి ఈ దొంగతనాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఫొటోలో ఉన్న దొంగలను ఎవరైనా చూసినట్లయితే వెంటనే తమ స్టేషన్ ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలని ఆయన వారికి తెలిపారు.

ప్రజాసంక్షేమానికి కృషి

ప్రజాదర్బార్‌లో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు


అర్జీలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ముందుకు వెళుతుందని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజాసమస్యల ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో జగన్ ప్రభుత్వంలో అందరూ ఎన్నో బాధలతో మిగిలారన్నారు. జగన్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ప్రజలు అనేక మోసాలకు గురై ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బాధితులుగా ఉన్న ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి తక్షణమే పరిష్కారం మార్గంగా ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఈ ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణంగా పరిశీలించి వారికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. మరలా వచ్చే సంవత్సరంలో ఈ ప్రజా దర్బార్ నిర్వహించి గత ప్రజాదర్బార్‌లో వారి సమస్యలకు ఎటువంటి పరిష్కారం చూపించారని, ప్రతీ అర్జీదారులకు జవాబుదారీతనంగా ఉండే విధంగా ఉండాలన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో 300 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దత్తసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా మద్దిరావమ్మ జాతర

ప్రజాశక్తి - కాళ్ల

మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో కొలువుతీరి ఉన్న మద్దిరావమ్మ జాతర మహోత్సవం వైభవంగా, భక్తి శ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి గ్రామంలో నిర్వహించే మద్దిరావమ్మ జాతర సందర్భంగా గ్రామస్తులందరూ అమ్మవారి ఊరేగింపులో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు, యువకులు, గ్రామ పెద్దలు రోడ్లపైకి వచ్చి అమ్మవారి జాతరను తిలకించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పెద్దలు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

'పోలీసులమంటూ మోసం'

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పలు వ్యాపారులకు పోలీసులు అంటూ ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు గురువారం మోసాలకు పాల్పడ్డారు. ఎస్ఐ కుటుంబ సభ్యులకు అనారోగ్యానికి గురయ్యారని తాను ఎఎస్ఐ భాస్కర్ రెడ్డిని అని, తాను తెలిపిన నెంబర్‌కు ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేయాలని అన్నారు. ఆ నగదును మొగల్తూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది దుకాణం వద్దకు వచ్చి అందజేస్తామని ఒక అపరిచిత వ్యక్తి వ్యాపారులకు ఫోన్ చేసి చెప్పారు. ఒక వ్యాపారి వారు చెప్పిన నెంబర్‌కు రూ.60 వేల నగదును బదిలీ చేసి అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇదంతా సైబర్ నేరగాళ్ల ఇలా మోసాలకు పాల్పడుతున్నారని, ఎవరికి నగదు చెల్లించవద్దని ఎస్ఐ జి.వాసు వ్యాపారులకు తెలియపరిచారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

మొగల్తూరు : మొగల్తూరులోని జాతీయ రహదారిపై గురువారం రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురుపై కేసుల నమోదు, అపరాధ రుసుములు విధించారు. ఈ తనిఖీలలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు సిహెచ్.వెంకటరమణ, కెఎస్ఎన్.ప్రసాద్, ఎన్ఎల్ఎస్.లక్ష్మి, ఎం.రవికుమార్, ఫణి తేజ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు గంబూషియా చేప కీలకం

హెల్త్ అధికారి జాలాది విల్సన్

ప్రజాశక్తి - గణపవరం

దోమల నియంత్రణకు గంబూషియా చేప పాత్ర కీలకమని గణపవరం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు అన్నారు. గురువారం స్థానిక ఒకటవ సచివాలయం పరిధిలోని హరిజనపేట వద్ద ఉన్న నీటి నిలవలలో గంబూషియా చేపలను వదిలారు. ఈ చేపల వల్ల దోమలు నియంత్రించటం సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎం.యేహన్, జి.శ్రీనివాస్, ఎం.నల్లయ్య, ఎఎన్ఎం పి.పుష్పవతి పాల్గొన్నారు.

గ్రామసభలు భూ సమస్యల పరిష్కార వేదికలు

డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు చక్కటి వేదికలా ఉన్నాయని పాలకోడేరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు అన్నారు. వెంద్ర గ్రామంలో రీ సర్వే గ్రామసభ గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా రీ సర్వేని చేయడం జరిగిందన్నారు. వందేళ్ల తర్వాత రీ సర్వే జరగడం శుభపరిణామం అన్నారు. రీ సర్వేలో భూ సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదులు అందించాలన్నారు. తద్వారా చక్కటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాఘవ రాజు, సర్వేయర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్, ఉప సర్పంచి భూపతిరాజు సుబ్బరాజు, ఎంపిటిసి పాల జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

మెప్మా బజార్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సమాఖ్య మెప్మా ఆధ్వర్యంలో నూతనంగా మార్కెట్ ప్రారంభించారు. స్థానిక అయిభీమవరం రోడ్ మలుపు వద్ద ఇటీవల ఖాళీ అయిన స్థలంలో మెప్మా సభ్యులు ఈ మార్కెట్ దుకాణాలు ప్రారంభించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు స్వయంగా ఉత్పత్తి చేసిన తినుబండరాలు, చేతి ఉత్పత్తులు కొనుగోలు చేసి అమ్ముతున్న వస్త్రాలు వంటి పలు రకాల దుకాణాలను ఇక్కడ ప్రారంభించారు. మొత్తం 30 మంది సభ్యులు ఈ దుకాణాలు తెరిచారు. ఈ వ్యాపారం ప్రతినెలకి ఒకసారి నిర్వహిస్తామని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ టి.అనిల్, లీడర్ విజయలక్ష్మిలు తెలిపారు.

ఆధార్ క్యాంపుల పరిశీలన

ప్రజాశ - గణపవరం

మండలకేంద్రం గణపవరంలో రెండవ సచివాలయంలో జరుగుతున్న ఆధార్ క్యాంపును, చినరామచంద్రపురంలోని మండలపరిషత్ పాఠశాలలో ఆధార్ క్యాంపులను జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి డిఎల్ డిఒ వై.దోసిరెడ్డి, గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్యాంపు వద్ద వచ్చిన వారికి ఆధార్ నమోదును సక్రమంగా జరపాలని అన్నారు. ఆధార్ నమోదు విషయంలో సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ పిఆర్‌డిపి వి.సత్యనారాయణ, గణపవరం పంచాయతీ కార్యదర్శి డి.శివరామ ప్రసాద్, మూడవ సచివాలయం కార్యదర్శి ఎ.భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - తణుకు

విద్యార్థులు తల్లిదండ్రులను, పాఠశాల ఉపాధ్యాయులను గౌరవిస్తూ సమాజంలో మంచి సత్ప్రవర్తనను కలిగి ఉండాలని తణుకు టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక పోలీస్ అవగాహన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణా లోపం, హెయిర్ స్టైల్స్, చెడు అలవాట్లకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణా చర్యలకు గురైతే వారి జీవితంలో అది మచ్చగా మిగిలిపోతుందన్నారు. విద్యార్థులకు పోలీసులు స్నేహితులుగా ఉంటారన్నారు. కాని చెడు ప్రవర్తన కలిగిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లిన రాధాకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ జిజె.ప్రభువరం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈనెల 25 నుంచి వచ్చేయేడాది ఫిబ్రవరి 2వ తేదీ వరకూ నిర్వహించే అఖిలభారత పశుగణన సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పశుగణన మాన్యువల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా లెక్కింపువలే పశుగణన లెక్కింపు కూడా ఎంతో ముఖ్యం అన్నారు. పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం దోహదపడుతుందన్నారు. భారతదేశం అంతటా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి 1919 నుంచి పశుగణన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, సహాయ సంచాలకులు నోయల్ పాల్గొన్నారు.

నరసాపురం : మండల పరిధిలో అఖిల భారత పశుగణన పారదర్శకంగా జరగాలని కొప్పర్రు పశువైద్యాధికారి డాక్టర్ ఐ.సురేంద్ర కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎల్‌బి చర్ల, కొప్పర్రు పశువైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28 వరకూ పశుగణన చేయడం జరుగుతుందని తెలిపారు.

గణపవరం : నేటి నుంచి గణపవరం, నిడమర్రు మండలాల్లో జాతీయ పశుగణన నిర్వహిస్తున్నట్లు గణపవరం సహాయక సంచాలకులు డిఎం.నాయక్ గురువారం తెలిపారు. పశుగణన ఈనెల 25 నుంచి 28 వరకూ జరుగుతుందని తెలిపారు. నాలుగు నెలల పాటు జరిగే సర్వేలో మండలాల్లో పశుసంఖ్యను నిర్థారణ చేయటం జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో అధికారులు చేసే సర్వేలో స్థానిక రైతులు సహకరించి పశువులు, గొర్రెలు, కోళ్ళు, కచ్చితమైన సంఖ్యను చెప్పి సహకరించాలని కోరారు. ప్రభుత్వం రైతులకు అందజేసే సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సర్వేకి ఉపయోగపడుతుందని చెప్పారు. అధికారులకు సర్వేలో సహకరించాలని కోరారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు


ట్రై సైకిల్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ పాలకొల్లు అధ్వర్యంలో వికలాంగునికి ట్రై సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం యలమంచిలి మండలం, చించినాడ గ్రామానికి చెందిన రేపూరి వెంకటగిరి(అబ్బులు)కు కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ ట్రై సైకిల్స్ పాలకొల్లులో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మదన్ మాట్లాడుతూ యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమల్లో భాగంగా క్లబ్ సభ్యులు, దాతల సహకారంతో పేద కుటుంబాలకు నిత్యావసరాలతోపాటుగా విద్యార్థులకు చదువు నిమిత్తం ఎడ్యూకేషన్ డోనేషన్లు, ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి తమవంతు సమాజసేవ కాపు సర్వీస్ క్లబ్ చేస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలకు ప్రణాళిక చేపట్టనున్నట్లు మదన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేరుకొండ దుర్గా ప్రసాద్, కటారి నాగేంద్ర, జక్కంపూడి కుమార్, యర్రంశెట్టి వెంకటరత్నం, మండెల ఫణి, పశ్యావుల రవి, ఇనుకొండ శేషాద్రి, కానూరి ప్రభాకర్, సంగినీడి రంగబాబు, గుండుమోగుల వీరాస్వామి, సత్తినీడి రాజా, చేగొండి బాబి, గజ్జరపు సురేష్, కోపెల్ల ప్రకాష్, గంధం యేసు, లంకలపల్లి కగరాజు, మంగెన సాయి, చెరుకూరి శ్రీనివాస్, కంచుస్థంభం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజా రక్షణలో పోలీసులకు సహకరించాలి

భీమవరం టౌన్ : ప్రజా రక్షణలో పోలీసులకు ప్రతి పౌరుడు సహకరించాలని రెండో పట్టణ సిఐ కాళీచరణ్ అన్నారు. ఆర్ఆర్ డిఎస్ డిగ్రీ కళాశాలలో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సిఐ కాళీ చరణ్ మాట్లాడుతూ నేరాలు జరిగినప్పుడు చూసినవారు నిర్భయంగా పోలీసులకు చెప్పినప్పుడు నేరస్తులను అదుపులోనికి తీసుకోవచ్చునని, ఎవరికి వారు మనకెందుకులే అనుకుంటే నేరాలు అదుపులోకి రావన్నారు. ప్రజాక్షేమం కోసం పోలీసులు నిబంధనలు ప్రవేశపెడతారని అన్నారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వికెజె ప్రసూన మాట్లాడుతూ ప్రజారక్షణలో పోలీసులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ - విధి విధానాలపై 36 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాస్, పి.అమూల్యరావు, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరు : విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు చేసుకోవాలని ఎస్ఐ జి.వాసు సూచించారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ పర్యవేక్షణలో విద్యార్థులకు సైబర్ నేరాలను అరికట్టేందుకు యువత పాత్ర వ్యాసరచన పోటీ, ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తొందరలోనే బహుమతులు అందిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పోలీస్ సిబ్బంది రాజేష్, మహిళా పోలీసులు కె.సుధారాణి, ఎం.భార్గవిశ్రీ, ఎం.బేబి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

28న మహా విజ్ఞాపన దీక్ష

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

తణుకు: అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 28వ తేదీన విజయవాడలో తలపెట్టిన మహా విజ్ఞాపన దీక్ష విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్యభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి పాలనలో అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. 2015 నాటికే అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ రూ.36 వేల కోట్లుగా ఉందన్నారు. ఇప్పుడు సుమారు లక్ష కోట్లుకుపైగా అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ పెరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సుమారు పదిన్నర లక్షల మంది డిపాజిట్ దారులకు రూ.3 వేల 80 కోట్లు చెల్లించాలన్నారు. డిపాజిట్‌దారులకు న్యాయం జరిగే విధంగా సమర్థవంతమైన అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం కార్యదర్శి వై.నాగలక్ష్మి, సిపిఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, నాయకులు ఎన్.రామశ్రీను, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాద్వానీ ఫౌండేషన్‌తో ఎస్ఆర్‌కెఆర్ ఎంఒయు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులకు ఇంటెన్‌షిప్‌లకు, ఇన్నోవేషన్స్ నూతన ఆవిష్కరణ చేసేందుకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాద్వానీ ఫౌండేషన్‌తో ఎంఒయు కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, వాద్వానీ ఫౌండేషన్ ప్రతినిధి విష్ణుప్రియ ఎంఒయు పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో విద్యార్థులకు ఇన్నోవేషన్ ఇంటెన్‌షిప్‌లు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. తమ కళాశాలలో ఉన్న టెక్నాలజీ సెంటర్, ఐడియా ల్యాబ్ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సిఎస్‌డి ఇన్‌ఛార్జి హెడ్, ఎంఒయు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సురేష్ బాబు మాట్లాడుతూ సిఎస్‌డి, సి, ఎస్ఐటి విభాగాలకు చెందిన రెండవ, మూడో సంవత్సరాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు 14 వారాల ఇగ్నైటెక్స్ ఆన్ ఎంటర్ప్రెనర్షిప్ శిక్షణ పొందుతున్నారని తెలిపారు. నలుగురు కళాశాల అధ్యాపకులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో అటానమస్ కళాశాలలో మొదటిసారిగా వాద్వానీ ఫౌండేషన్ ఎంటర్ప్రెనర్షిప్, స్టార్ట్ అప్ ప్రమోషన్‌కు తమ కళాశాలతో ఎంఒయు చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వెట్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.శివ కిషన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పోలియో దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు

రెండు పోలియో చుక్కలు వేసి పసిపిల్లల భవిష్యత్తును కాపాడాలని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా తణుకు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్(ఆర్ట్స్) ప్రభుత్వ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పోలియో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ పోలియోరహిత సమాజాన్ని ఏర్పరచడానికి అనేక సంవత్సరాలుగా పోలియో నివారణకు అన్ని ప్రభుత్వాలతో పాటు కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేస్తున్నాయన్నారు. పోలియో వ్యాక్సినేషన్ కనుగొనడానికి బృందంగా ఏర్పడి ఆ బృందానికి నాయకత్వం వహించినటువంటి డాక్టర్ జాన్సన్ సాల్క్ జయంతి సందర్భంగా ఈనెల 24న పోలియో డే జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ పోలియో వ్యాక్సినేషన్ నివారణకు గాను 122 దేశాలకు ప్రతీ సంవత్సరం రూ.40 వేల కోట్లు రోటరీ క్లబ్ ద్వారా వెచ్చిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మస్తాన్‌రావు(బాబి), కార్యదర్శి కతారి సిదార్ధ, రోటరీ సభ్యులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులచే ఉల్లంపర్రు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రపంచం మొత్తం మీద పోలియో చుక్కల తయారీలో రోటరీ ఇంటర్నేషనల్ సేవా సంస్థ పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం చేస్తుంది. పోలియో నిర్మూలాన రోటరీ లక్ష్యం అని క్లబ్ ప్రెసిడెంట్ రావాడ సతీష్ తెలియజేశారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ప్రతిఒక్కరూ రెండు పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, సెక్రటరీ జవ్వాజి కళ్యాణ్, ట్రెజరర్ పోతాబత్తుల సత్యనారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ చందకరాము, మద్దాల వాసు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఉండి

రీ సర్వే కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్ అన్నారు. పాములపర్రు గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభలో వారు మాట్లాడారు. సర్వే నంబర్ల జారీ, ఇతర రెవెన్యూ సమస్యలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామ సర్పంచి కేసన శాంత కుమారి, బలుసులు రావు మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించిన సభలో రైతులు ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. టిడిపి నాయకుడు తోట శ్రీరాములు మాట్లాడుతూ ఆక్వా చెరువుల రైతులకు ఒకటే ఎల్‌పి నంబర్లు ఇచ్చిన చోట్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రెవెన్యూ భూ సమస్యలను త్వరితగతిన అధికారులు పరిష్కరించాలని కోరారు. అనంతరం పాములపర్రు గ్రామానికి చెందిన వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను వారు అందించారు. ఎంపిటిసి సభ్యుడు ఎడవల్లి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి వర్రె పెదరాగవులు, ఆర్ఐ కార్తీక్, గ్రామ సెక్రెటరీ శివాజీ ఉన్నారు.

నరసాపురం : రీ సర్వే గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూముల సమస్యల పరిష్కారానికే రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ల్యాండ్ రికార్డ్సు ఎంఎకె.కుమార్ అన్నారు. సీతారాంపురం సౌత్ గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం కలగనున్నదని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ తెలిపారు. మొగల్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పడమటిపాలెం, సుబ్రహ్మణ్యేశ్వరం, కొత్తపాలెం, శేరేపాలెం, నక్కవారిపాలెం, ఇంజెటివారి పాలెం, గరువు పల్లవపాలెం, రామలబంధగరువు, నవుడూరు వాని గురువు గ్రామాలలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ సరఫరా లైన్లకు అంతరాయంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తున్నామన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఆయన తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నరసాపురం : సీతారాంపురం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఈనెల 25న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ కార్యానిర్వహక ఇంజనీర్ మధుకుమార్ తెలిపారు. ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నిమిత్తం సీతారాంపురం నార్త్, సీతారాంపురం సౌత్, యర్రంశెట్టిలెం, రుస్తుంబాద్ మంగలగుంటపాలెం, మండావారిపేట, ఎల్‌బిచర్ల, పసలదీవి, తూర్పుతాళ్లు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని రాజుల్లంక ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగిస్తామన్నారు. వేములదీవి, కాపులు కొడప, బియ్యపుతిప్ప, మర్రితిప్ప, దర్భరేవు, తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఛాంబర్స్‌లో 'మాదకద్రవ్యాలు, పొగాకు రహిత ఎపి'

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, పొగాకురహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకొల్లు ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ సిఐ మద్దాల శ్రీనివాసరావు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సిఐ మాట్లాడుతూ మానవ పరిణామ క్రమంలో మన ముందు తరం ఎంతో నిబద్ధతతో జీవించడం వల్ల నేటి ఈ అభివృద్ధికి బాటలు వేశారని, నేడు అందరూ తెలిసి చేస్తున్న తప్పులు భావితరంలో అభివృద్ధి కుంటుపడుతుందని, కుటుంబాలు నాశనం అవుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లను విధిగా ధరించాలి

ప్రజాశక్తి - ఉండి

ప్రతిఒక్కరూ తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లను విధిగా ధరించాలని, లేనిపక్షంలో పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని సిఐ వి.జగదీశ్వరరావు వాహనదారులను హెచ్చరించారు. గురువారం రాత్రి ఉండి మెయిన్ సెంటర్లో ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని వి.జగదీశ్వర్ రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో గొలుసు దొంగలు ఎక్కువగా సంచరిస్తున్నారని వారు నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను, దొంగ బళ్లను వేసుకుని తిరుగుతున్నారని అన్నారు. అటువంటి వారికోసం మండల వ్యాప్తంగా వాహనాలు తనిఖీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ విధిగా తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు ధరించి వాహనానికి సంబంధించిన పత్రాలు అన్నింటిని జాగ్రత్తపరుచుకోవాలని ఆయన సూచించారు.